

బీరప్ప ఆలయంలో యజ్ఞం

సారంగాపూర్, మే 19: మండల కేంద్రంలోని ఊరగుట్టపై గల బీరప్ప ఆలయంలో కుర్మ సంఘం కులస్తులు ఆదివారం యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా కుర్మ కులస్తులు కుటుంబ సమేతంగా వీధులలో డప్పు మేళాల మధ్య ఊరేగింపుగా బీరప్ప ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అన్నదానం చేశారు. ఈ యజ్ఞ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు.



• ఆక్రమణకు గురవుతున్న మంజులాపూర్ చెరువు



• చెరువులో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు



• వర్షాలకు ముంపునకు గురైన నిర్మల్‌లోని జీఎన్ఆర్ కాలనీ (ఫైల్)

గొలుసు కట్టుపై కబ్జాల కనికట్టు!



- చెరువుల ఆక్రమణలతోనే ప్రతీ ఏటా నిర్మల్‌కు ముప్పు
- కందకాలు, నాళాల ఆక్రమణలతో వరద నీరంతా రోడ్డు పైనే..
- అధిక ఖర్చులతో మరింత భారం
- అడ్డగోలు వెంచర్లతోనూ సమస్య
- నిర్మల్‌ను వెంటాడుతున్న ల్యాండ్ మాఫియా

నిర్మల్, మే19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన చారిత్రక నిర్మల్ పట్టణం ప్రతీ ఏటా వర్షాకాలంలో ముంపు బారిన పడుతోంది. కాకతీయుల కాలంలో ప్రణాళికాబద్ధంగా నిర్మించిన గొలుసుకట్టు చెరువులు, కందకాల కబ్జాలతోనే ప్రతీసారి నిర్మల్ వరద నీటిలో మునిగి తేలుతోంది. అధికారులు వర్షాకాలం కన్నా ముందుగానే అప్రమత్తమై మిగిలి ఉన్న కందకాలు, నాళాలను శుభ్రం చేసి వర్షం నీరంతా రోడ్డు దాటకుండా చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ వారు సకాలంలో స్పందించని కారణంగా సమస్య ప్రతీ ఏటా జనాన్ని వెంటాడుతోంది. ఊరి బయట ఉన్న ఈ గొలుసుకట్టు చెరువులన్నీ పెరిగిన జనాభా, ఇళ్ల నిర్మాణాల కారణంగా జనావాసాల మధ్యలోకి చేరుకున్నాయి. దీంతో చెరువు భూములపై కబ్జాదారుల కళ్లుపడ్డాయి. జిల్లా కేంద్రమైన నాటి నుంచి నిర్మల్ ప్రాంతంలో భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రస్తుతం అందరి దృష్టి ఆ భూములపైనే పడుతోంది. ముఖ్యంగా నిర్మల్ పట్టణంతో పాటు శివారు ప్రాంతాల్లోనూ, గ్రామాల్లోనూ డీటీసీపీ అనుమతులు లేకుండా అనధికారిక వెంచర్లు ఇష్టారాజ్యంగా వెలుస్తున్నాయి. ఇలా వెలుస్తున్న వెంచర్లలో చెరువు భూములే ఎక్కువగా ఉంటున్నాయన్న ఫిర్యాదులున్నాయి. చెరువు భూముల పక్కన ఉన్న పట్టా భూముల సర్వే నంబర్లతో ఈ చెరువు భూములను ఆక్రమించి రియల్టర్లు అక్రమ వెంచర్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రమైన నాటి నుంచి నిర్మల్‌లో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ప్రభుత్వ భూములు, చెరువులకు సంబంధించిన శిఖం, బఫర్ జోన్ భూములపై కబ్జాదారుల కన్ను పడింది. అధికార పార్టీ నేతల అండదండలు, అధికారుల సహకారంతో రికార్డులను సైతం తారు మారుచేసి పలువురు చెరువు భూముల ఆక్రమణకు పాల్పడ్డట్లు ఫిర్యాదులన్నాయి. గతంలో రాష్ట్ర హైకోర్టు సైతం ఇక్కడి చెరువు భూముల ఆక్రమణపై ఆగ్రహం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. అయితే చెరువు భూముల ఆక్రమణ కారణంగా ప్రతీ ఏటా వర్షాకాలంలో అనేక కాలనీలు జలమయం అవుతున్నాయి. దీంతోపాటు నిర్మల్ పట్టణ నడిబొడ్డున ఉన్న భారీ కందకాలు కూడా ఎక్కడికక్కడ ఆక్రమణకు గురయ్యాయి. దీంతో ఈ కందకాల గుండా ప్రవహించాల్సిన నీరంతా సమీప కాలనీలోకి తన్నుకొస్తోంది. దీంతోపాటు నాళాలు సైతం ఆక్రమణకు గురవుతుండడంతో మురుగు నీటి ప్రవాహం ముందుకు సాగడం లేదు. ఒక్కసారి గంటకు పైగా భారీ వర్షం కురిస్తే నిర్మల్ పట్టణంలోని అనేక వార్డులు జలమయం అవుతుండడం సాధారణంగా మారింది. గతంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా నిర్మల్‌లోని చారిత్రక గొలుసుకట్టు చెరువుల భూములను సర్వే ద్వారా నిర్ధారించారు. అయితే కంచరోని చెరువు, ధర్మసాగర్, మోతి తలాబ్, మంజులాపూర్, పల్లె చెరువుల భూములను ఇప్పటికే పెద్దమొత్తంలో ఆక్రమించేశారు. ఆక్రమించిన భూములలో శాశ్వత నిర్మాణాలు కూడా చేపట్టినట్లు విమర్శలున్నాయి. మరికొన్నిచోట్ల కందకాలను సైతం కబ్జాదారులు మింగేశారు. నిర్మల్‌లోని డాక్టర్స్‌లేన్ ప్రతీయేటా వర్షకాలంలో నీట మునిగిపోతుండడానికి ప్రధానకారణం కందకాల కబ్జానేనని చెప్పకతప్పదు. దీనికి సమీపంలోనే ఉన్న ధర్మసాగర్ చెరువు కూడా పెద్ద ఎత్తున ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే కంచరోని చెరువు, మంజులాపూర్ చెరువుల భూములు కూడా ఆక్రమణకు గురైనట్లు చెబుతున్నారు. ఇలాంటి ఆక్రమణ కారణంగానే జీఎన్ఆర్ కాలనీతోపాటు సిద్ధాపూర్, ఆదర్శనగర్, శాంతినగర్, ఇంద్రానగర్, శాస్త్రినగర్, వైఎస్ఆర్ కాలనీ, విశ్వనాథ్ పేట్, తదితర ప్రాంతాలన్నీ వరద నీటిలో చిక్కుకుంటున్నాయి. వర్షం వచ్చిందంటే ఈ కాలనీ వాసులు అంతా తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలో..

ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీల పరిధిలో కూడా ఇష్టారాజ్యంగా కబ్జాల పర్వం కొనసాగుతూ ఉండడంతో వరదనీరంతా అక్కడి రోడ్లను ముంచెత్తుతోంది. జనావాసాల్లో వరద నీరు జనాన్ని అతలాకుతలం చేస్తోంది. ఇళ్లలోకి పెద్దఎత్తున వరద నీరు చేరుకోవడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రతీఏటా ఇది సాధారణమైనప్పటికీ పాల కులలో మాత్రం కదలిక కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇక్కడి రాజకీయనేతల వెంచర్లు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములలో ఇష్టారాజ్యంగా చేపడుతున్న నిర్మాణాలు ఈ పట్టణంలోని పలు వార్డుల ముంపునకు కారణం అవుతుందంటున్నారు. ముఖ్యంగా భైంసాలోని ఆటోనగర్, కుబీర్‌చౌరస్తా, వినాయక నగర్ తదితర వార్డులు అలాగే ఖానాపూర్‌లోని మెయిన్ రోడ్‌తో పాటు మరికొన్ని వార్డులను వరద నీరు ముంచెత్తుతోంది.

పక్కా ప్రణాళిక లోపం కారణంగానే..

నిర్మల్‌తోపాటు భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల పరిధిల్లో పక్కా ప్రణాళికలు రూపొందించకపోతుండడంతోనే వరద నీటి సమస్య ఉత్పన్నమవుతోందని అంటున్నారు. ముఖ్యంగా నిర్మల్ పట్టణం చుట్టూ ఉన్న గొలుసుకట్టు చెరువుల భూములు ఆక్రమణకు గురవుతుండడం వరదముప్పుకు కారణమవుతోందని అంటున్నారు. చెరువుల్లో ప్రవహించాల్సిన నీరంతా ఆక్రమణల కారణంగా రోడ్లపైకి చేరుతోంది. అలాగే భైంసా, ఖానాపూర్‌లలో కూడా ఇలాంటి పరిస్థితే కొనసాగుతోంది. సంబంధిత మున్సిపాలిటీలు వరద నీటిని అడ్డుకునేందుకు ప్రణాళికలు రూపొందించకపోతుండడం సమస్యగా మారింది. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు, ఆక్రమణలపై నిఘా లేకపోవడం లాంటి కారణాలు పట్టణాలకు ముప్పుగా మారుతోందంటున్నారు. అధికారులు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని చెరువుల ఆక్రమణలను నివారించడమే కాకుండా అడ్డగోలు నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

అటకెక్కిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ ప్రతిపాదన

నిర్మల్ పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మిస్తామంటూ పాలకులు ఏళ్ల నుండి చెబుతూనే ఉన్నారు. ఇప్పటివరకుఆ దిశగా ఎలాంటి కదలిక కనిపించడం లేదు. గతంలో కేంద్ర ప్రభుత్వం పట్టణ అభివృద్ధి శాఖకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం సంబంధించి ప్రతిపాదనలు కూడా పంపారు. 60 కోట్ల రూపాయలతో రూపొందించిన ఈ ప్రతిపాదనలకు ఇటు రాష్ట్ర ప్రభుత్వం గానీ అటు కేంద్ర ప్రభుత్వాలు గానీ పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. రాష్ట్రప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాన్ని చేపట్టాలని పలువురు సూచిస్తున్నారు.



• వరద నీటిలో ముంపునకు గురైన నిర్మల్‌లోని సిద్ధాపూర్ ఇల్లు (ఫైల్)



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నిర్మల్ కల్చరల్, మే19: సోన్ మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల 1997-98 పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు అంతా ఒకే వేదికపై కలుసుకుని వారి అనుభవాలు, అనుభూతులు పంచుకున్నారు. ఆప్యాయంగా పలుకరించుకుని సంతోషంగా గడిపారు. తమకు విద్యాబోధన చేసిన మోహన్‌రెడ్డి, వెంకట్రామ్ రెడ్డి, శివప్రసాద్, శేషాద్రి, మహేష్ చందర్, రాజేశ్వ ర్‌లను సన్మానించి అభిమానాన్ని చాటుకున్నారు.

ఏఎన్ రెడ్డి కాలేజీ పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

నిర్మల్ కల్చరల్, మే19: నిర్మల్ పట్టణం ఏఎన్‌రెడ్డి జూనియర్ కాలేజీలో 1996-98 పూర్వవిద్యార్థులు అంతా ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. చదువుతుకునే సమయంలోని తమ జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా లెక్చరర్లు శంకర్, ప్రకాష్, చిన్నయ్య, రాంచంద ర్, నాగేశ్వర్ రావు, రాజా రమేష్‌లను ఘనంగా సన్మానించారు.

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

నిర్మల్ కల్చరల్, మే19: పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి డి.నూతన్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడుగా కీర్తి వహించారన్నారు. సాధారణ జీవితం గడిపి ప్రజల మన్ననలు పొందాడన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడి 10 లక్షల ఎకరాల భూములను పేదలకు అందేలా కృషి చేశారని తెలిపారు. గొప్ప విప్లవ కారుడని కొనియాడారు. కార్యక్రమంలో డి.తిరుపతి, తొడసరం శంభు, డి. పోశెట్టి, సాయికిరణ్, సంతోష్, పవన్ పాల్గొన్నారు.



నివాళులర్పించి జోహార్లు పలుకుతున్న నాయకులు

బాసరలో భక్తుల సందడి !



అమ్మవారి సన్నిధిలో పిల్లలకు అక్షర శ్రీకార పూజలు జరిపిస్తున్న భక్తులు

బాసర, మే19: బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవు దినానికి తోడు ఏకాదశి పర్వదినం కలిసి రావడంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి భక్తులు సరస్వతి అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. శుభదినం కావడంతో అక్షర శ్రీకారపూజలు భారీగా నమోదయ్యాయి. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు, దర్శనాల కోసం రెండు గంటల పాటు భక్తులు క్యూ కట్టాల్సి వచ్చింది.

పిల్లలను ప్రభుత్వ కళాశాలకు పంపండి

• గ్రామాల్లో అధ్యాపకుల ప్రచారం



ప్రభుత్వ కళాశాలలో ఉన్న సౌకర్యాలను పోషకులకు వివరిస్తున్న అధ్యాపకులు

ముథోల్, మే 19 : పిల్లలను ప్రభుత్వ కళాశాలకే పంపాలని ముథోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు గ్రామాలకు వెళ్లి పోషకులను కోరుతున్నారు. ప్రిన్సిపాల్ కైసర్ పాషా ఆధ్వర్యంలో అధ్యాపకులు మండలంలోని ఆయా గ్రామాల్లో కరపత్రాలతో వెళ్లి పోషకులకు, విద్యార్థులకు కలిసి అవగాహన కల్పిస్తున్నారు. తమ ప్రభుత్వ కళాశాలలో తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ మీడియంతో పాటు ఒకేషనల్ కోర్సులు సైతం ఉన్నాయని వివరిస్తున్నారు. ఒకేషనల్‌లో ఫిషరీస్, ఈటీ, ఓఎ, డైరీ, గ్రూపులతోపాటు బైపీసీ, ఎంపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీలు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందుతుందని వివరిస్తున్నారు. తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించాలని పోషకులతో కలిసి కోరుతున్నారు. మండలంలోని బోరిగాం, ఎడ్‌బిడ్, ముథోల్ తదితర గ్రామాల్లో ప్రతీరోజు అధ్యాపకులు బృందాల వారీగా వెళ్తూ క్షేత్రస్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులను కలుస్తున్నారు. విశాలమైన తరగతి గదులు, ఆటస్థలం, ప్రయోగశాల, గ్రంథాలయం, ఉచిత అడ్మిషన్లు, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, వారాంతపు, మాసాంతపు పరీక్షల నిర్వహణ, ప్రైవేట్ కళాశాలలకు దీటుగా విద్యాబోధన ఉంటుందని తెలుపుతున్నారు. మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ముథోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని అధ్యాపకులు పేర్కొంటున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, స్వరూప, నారాయణ, పవన్, తదితరులున్నారు.

విద్యుత్ శాఖలో ప్రీమాన్ సూన్ చెకప్

- తీగలను తాకుతున్న చెట్టు కొమ్మల తొలగింపు
- వేలాడుతున్న విద్యుత్ తీగల బిగింపు
- సరాఫరాలోని ఆటంకాలు, అంతరాయాలను అధిగమించేందుకు విద్యుత్ శాఖ ముమ్మరంగా చర్యలు



విద్యుత్ తీగలకు తాకుతున్న కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

భైంసా, మే 19: విద్యుత్ సరఫరా వ్యవస్థకు ఎలాంటి అటంకాలు, అంతరాయలు ఏర్పడకుండా ఉండేందుకు గాను ట్రాన్స్‌కో అధికారుల ఆధ్వర్యంలో జిల్లాలో ప్రీమాన్ సూన్ చెక్‌ఆప్ చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎస్ఈ బి.శ్రీనివాస్, భైంసా, నిర్మల్ డీఈలు నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి సారథ్యంలో ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల వారీగా సరఫరా వ్యవస్థ మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి వేసవి కాలంలో విద్యుత్‌శాఖ ప్రీమాన్ సూన్ చెక్ ఆప్ కార్యక్రమాన్ని ప్రణాళికబద్దమైన చర్యలతో పకడ్బందీగా నిర్వహిస్తోంది.

• జిల్లాలో 90 విద్యుత్ సబ్‌స్టేషన్లు

జిల్లాలోని భైంసా, నిర్మల్ విద్యుత్ డివిజన్‌ల పరిధిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు 90 ఉన్నాయి. ఇందులో భైంసా డివిజన్ పరిధిలో 30 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉండగా మిగతావన్ని నిర్మల్ డివిజన్ పరిధిలో ఉన్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా ఉండేందుకు అవసరమైన మరమ్మతు చర్యలను ప్రీమాన్‌సూన్ చెక్‌ఆప్ పేరిట నిర్వహిస్తున్నారు. ఇదివరకే సంబంధిత విషయమై లోపాలను తెలుసుకునేందుకు పూర్తిస్థాయి సర్వే నిర్వహించిన అధికారులు ప్రస్తుతం వ్యవస్థ మెరుగుదలకు చర్యలకు కసరత్తులు చేపట్టారు సబ్‌స్టేషన్ల వారీగా విద్యుత్ సరఫరాను నిలిపివేసి ఆయా ప్రాంతాల విద్యుత్ అధికారులు, సిబ్బంది గ్రూపులుగా విడిపోయి ప్రీమాన్ సూన్‌చెక్‌ఆప్ కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నిర్వాహణ వ్యవస్థను పర్యవేక్షిస్తున్నారు.

• లోపాల తొలగింపునకు ముమ్మరంగా చర్యలు

ప్రీమాన్ సూన్ చెక్‌ఆప్‌లో భాగంగా అన్నిప్రాంతాల్లో విద్యుత్ తీగలకు తగిలే స్థితిలోనున్న చెట్టుకొమ్మలను తొలగింపచేస్తున్నారు. వేలాడుతున్న విద్యుత్ తీగలను బిగుతూ చేస్తున్నారు. దుస్థితిలో ఉన్న విద్యుత్ స్తంభాల ఇన్సులేటర్లను తొలగించి కొత్తవాటిని అమర్చే పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నిర్వహణ వ్యవస్థ మెరుగుదలకు అవసరమైన మార్పులు, చేర్పులు చేపడుతున్నారు. చెడిపోయిన ఫ్యూజ్‌బాక్స్‌లను తొలగించి వాటి స్థానాల్లో కొత్త వాటిని అమర్చుతున్నారు. బలహీనంగా మారిన విద్యుత్ తీగల స్థానాల్లో సామర్థ్యం గల తీగలను బిగిస్తున్నారు. లూజ్ కనెక్షన్స్‌ను బిగుతూ చేస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రీమాన్ సూన్‌చెక్‌ఆప్ కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయి. తద్వారా రాబోయే రోజుల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థకు ఎలాంటి ఆటంకాలు, అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా లోపాలను సవరించే చర్యలు తీసుకుంటున్నారు.



తీగలను తాకుతున్న చెట్టుకొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది



భైంసా సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

అంతరాయం లేని సరఫరా కోసం పకడ్బందీ చర్యలు

• శ్రీనివాస్‌రెడ్డి, డీఈ, భైంసా డివిజన్

ప్రణాళికాబద్ధమైన విధానాల ద్వారా అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను అందించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాం. ఎస్ఈ బి.శ్రీనివాస్ ఆదేశాలకు అనుగుణంగా సరఫరా వ్యవస్థకు అటంకంగానున్న సమస్యలన్నింటిని పరిష్కరింపచేస్తున్నాం. క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటనలు చేపడుతూ లోపాలను సవరిస్తున్నాం. విద్యుత్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తూ విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేసే దిశగా చర్యలను ముమ్మరం చేశాం.

జాతీయస్థాయి వూషూ పోటీలకు ఎంపిక

భైంసా, మే 19: వచ్చే నెలలో తమిళనాడు రాష్ట్రంలో జరుగనున్న 23 వ జాతీయస్థాయి వూషూ పోటీలలో పాల్గొనేందుకు భైంసాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అమచ్యూర్ వూషూ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు జరిగాయి. ఇందులో జిల్లా నుంచి 10మంది క్రీడాకారులు పాల్గొనగా భైంసా ఖేలో ఇండియా వూషూ కేంద్రానికి చెందిన ముగ్గురు క్రీడాకారులు ప్రతిభను కనబరిచి బంగారు పతకాలు సాధించి 23వ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దౌష్ విభాగంలో జి.అనన్య (భైంసా), 60 కేజీల విభాగంలో ఎల్.అలెఖ్ (భైంసా), 80 కేజీల విభాగంలో హర్ష వర్ధన్ (భైంసా)లు బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వారిలో ఉన్నారు. వీరితో పాటు ఎంపిక పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారుల్లో ఎస్, విద్య (గోడాపూర్, కుభీర్ మండలం),ఎస్.రామ్ చరణ్(పాంగ్రి,భైంసా మండలం), ఆకాష్ (కోలూర్, తానూర్ మండలం)లు రజత పతకాలు సాధించారు.



ఓల్డ్ హౌజింగ్ బోర్డు కాలనీలో ఇళ్ల మధ్యనే వేసిన చెత్తాచెదారం



చెత్తాచెదారంతో నిండి కనిపిస్తున్న దస్నాపూర్‌లోని మురికాల్వ

ముక్కు మూసుకోవాల్సిందేనా?

● ఆదిలాబాద్ పట్టణంలో పేరుకుపోతున్న చెత్తాచెదారం ● స్థానికులకు తప్పని తిప్పలు ● స్పందించని పారిశుధ్య సిబ్బంది

ఆదిలాబాద్ అర్బన్, మే 19: పట్టణంలోని పలు కాలనీల్లో చెత్తాచెదారం పేరుకు పోయి కంపు కొట్టడంతో ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీలో ఎటు చూసిన అపరిశుభ్రత పరిస్థితులే దర్శనమిస్తోంది. సరైన రోడ్లు, మురికినీటి కాలువల నిర్మాణం లేక పోవడంతో చెత్తాచెదారం పేరుకు పోతుంది. పలు కాలనీల్లో రోడ్లపైనే ఎక్కడికక్కడ నీరు ప్రవహిస్తోంది. దీనివల్ల స్థానికులు కాలినడకన నడవడానికి సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లమధ్యనే మురికినీరు నిలిచి ఉండడంతో తీవ్ర దుర్గంధం వెద జల్లుతోంది. నివాసాల మధ్యనే మురికినీరు నిలిచి ఉండడంతో పందులు, దోమల బెడదను తట్టుకోలేకపోతున్నారు. మరోవైపు కేఆర్‌కే కాలనీ, పలు కాలనీల్లో సిమెంట్ రోడ్లు, మురికి కాల్వలు లేక నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. మురికి కాలువలు సరిగా నిర్మించకపోవడంతో మురికి నీరంతా రోడ్లపైకి వస్తోందని విమర్శిస్తున్నారు. కాలనీలో మురుగు కాలువలు చెత్తాచెదారంతో పేరుకుపోయాయని ఆరోపిస్తున్నారు. కాలనీలో మురికినీటి కాలువలు నిర్మించిన నాణ్యత లేకపోవడంతో మున్నాళ్ల ముచ్చటగానే మారుతున్నాయి.

● రోజుల తరబడి ఎక్కడి చెత్త అక్కడే!!

రోజుల తరబడి మున్సిపల్ సిబ్బంది మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో చెత్త పేరుకుపోతోందంటున్నారు. మురుగునీటి గుంతలు ఏర్పడడంతో దోమలు పెరుగుతున్నాయని, దీంతో కాలనీ వాసులు రోగాలబారీన పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య సిబ్బంది కనీసం వారానికి ఓ సారైనా కాల్వలు శుభ్రం చేయడం లేదని స్థానికులు ఈ విషయమై పేర్కొంటున్నారు. అంతేకాకుండా సక్రమంగా బ్లీచింగ్, దోమల నియంత్రణకు స్ప్రే చేయకపోవడంతో ఈగలు, దోమల బెడద విపరీతంగా పెరిగి పోతుందని పేర్కొంటున్నారు. అంతేకాకుండా వర్షాకాలం సమీపిస్తుండడంతో ఏ కొద్ది పాటి వర్షం కురిసిన రోడ్ల పైననే మురికి నీటి కాల్వలు పొంగి ప్రవహించే ప్రమాదం కనిపిస్తుంది. ఇకనైనా వానకాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మున్సిపల్ అధికారులు మురికి నీటి కాల్వలను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



కేఆర్‌కే కాలనీలో నివాసాల మధ్యలో నిలిచి ఉన్న మురికినీరు



కైలాస్‌నగర్ కాలనీలో రోడ్డు పక్కన పడేసిన చెత్తాచెదారం

భార్య మెడకు తాడు బిగించి హత్య

ఇచ్చోడ, మే 19: మత్తుకు బానిసై కట్టుకున్న భార్యను కడతేర్చిన ఘటన మండలంలోని గాంధీనగర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలిసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ గ్రామానికి చెందిన గుట్టె వెంకటితో 2015లో ఇంద్రవెల్లి మండలం సత్యాజిగూడకు చెందిన రేణుక(28)తో వివాహం జరిగింది. దాదాపు 8ఏళ్లకు వారికి కూతురు జన్మించింది. వెంకటి మద్యానికి బానిసై తరచు భార్య అయిన రేణుకను వేధించడంతో తల్లిగారింటికి వెళ్లగా పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. ఇంట్లో భర్తతో పాటు తండ్రి ఉత్తం, చిన్ననాన్న కలిసి నివాసం ఉంటున్నారు. గత 5నెలల క్రితమే మృతురాలి అత్తమ్మ చనిపోవడంతో వచ్చిన బీమా డబ్బులతో వెంకటి కొత్త ఇల్లును నిర్మించి జల్సాలు చేస్తున్నాడు. ఇంకా డబ్బులు కావాలని ఉన్న మేకలను అమ్మేస్తానని చెప్పడంతో భార్య నిరాకరించింది. దీంతో గొడవలు మరింత పెరిగాయి. శనివారం రాత్రి రేణుక మేడకు తాడు బిగించగా ఆమె చనిపోవడంతో భర్త అక్కడినుంచి పరరాయ్యాడు. విషయం తెలుసుకున్న సీఐ భీమేష్, ఎస్సై నరేష్‌లు సంఘటన స్థలానికి పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టిన రుద్ర నేత్ర ప్రజా సేవసమితి ప్రతినిధులు, గ్రామస్థులు

నిపానిలో గాంధీ విగ్రహం ధ్వంసం

భీంపూర్, మే 19: మండలంలోని నిపాని ఆటో స్టాండ్ వద్ద ఉన్న గాంధీజీ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు శనివారం ధ్వంసం చేసిన ఘటన ఆదివారం వెలుగులోకివచ్చింది. గ్రామస్తులు, రుద్ర నేత్ర ప్రజా సేవ సమితి అధ్యక్షుడు మల్లెల పంజాబ్, సభ్యులు ఉల్లాస్, ఆశన్నలు భీంపూర్ పోలీసులకు సమాచారం అందించారు. నిందితులను త్వరగా గుర్తించి శిక్షించాలని నిరసన చేపట్టారు. ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ప్రదీప్‌కుమార్, తదితరులు తెలిపారు.



పట్టుబడిన లారీలు

మామిడి పండ్ల లారీల పట్టివేత

మావల, మే 19: పరిమితికి మించి రసాయనాలను వాడి మామిడి కాయలను పండ్లుగా మార్చి తరలిస్తున్న మామడి పండ్ల లారీలను కన్సుమర్ రైట్స్ స్వచ్ఛంద సంస్థ వారు మావల సమీపంలో పట్టుకుని అధికారులను అప్పగించారు. ఈ మేరకు ఆహార భద్రత అధికారులు పండ్ల నమూనాలను సేకరించారు. వినియోగదారుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు మాట్లాడుతూ మోతాదుకు మించి రసాయనాలను వాడటం వల్ల అనేక రకల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే అక్రమ రవాణా జరుగుతుందన్నారు. ఇందులో సంఘం ప్రతినిధులు శైక్ ఇర్ఫాన్, మల్లేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి గాయాలు

భైంసా రూరల్, మే 19: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో ఐదుగురిపై పిచ్చికుక్క దాడి చేసి ఆదివారం విచక్షణారహితంగా గాయపరిచింది. ఈ దాడిలో పశువులు సైతం గాయపడ్డాయి. గాయపడిన వారిలో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. వారిని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు. కుక్కల బెడద విషయమై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మహాలక్ష్మీ ఆలయానికి వెళుతున్న గ్రామస్థులు

కనుగుట్టలో ఘనంగా మహాలక్ష్మి పండుగ

బోథ్, మే 19: మండలంలోని కనుగుట్ట గ్రామంలో ఆదివారం మహాలక్ష్మీ పండుగను గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలానికి ముందుగా గ్రామ దేవతలకు పండుగ చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈసందర్భంగా గ్రామస్తులు ఊరేగింపుగా వెళతారు. అయితే గ్రామస్తులంతా ఒకే చోట చేరి వంటలుచేసుకుని భోజనాలు చేస్తారు. ఈసందర్భంగా గ్రామ దేవతలకు మేకలను బలి ఇచ్చి పండుగ చేస్తారు. గ్రామస్థులంతా ఐకమత్యంగా పండుగ వేడుకలను జరుపుతారు.

పోచమ్మ తల్లి.. దీవించు తల్లి!

సారంగాపూర్, మే 19 : మండలంలోని అడెల్లి పోచమ్మ దేవాలయంలో ఆదివారం భక్తులు పోచమ్మ తల్లి దీవించు తల్లి అంటూ మొక్కులను మొక్కారు. ఈ ఆలయానికి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి మొక్కులను మొక్కి పెరుగన్నంను నైవేద్యంగా సమర్పించారు. ఆలయానికి మొక్కులను తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కోకుండా ఉండడానికి ఆలయ ఇన్‌చార్జి ఈవో రంగు రవి కిషన్ గౌడ్‌లు అన్ని ఏర్పాట్లను చేశారు. మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు జాతకాలను సరిచూసుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆలయానికి మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అలాగే ఆలయం వద్ద త్రాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నారు. నిర్మల్, భైంసా డిపోల నుండి అధిక సంఖ్యలో బస్సు సౌకర్యాలను కల్పించారు.

'కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం'

ఆదిలాబాద్ అర్బన్, మే 19: నేతకాని మహార్‌ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని నేతకాని మహార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడుజాడి నర్సయ్య అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసిన ఆయన్ను సంఘం నాయకులు సత్కరించారు. మహార్ కుల ధ్రువీకరణ పత్రం ఆర్డీఓ ద్వారా కాకుండా తహసీల్దార్ ద్వారానే ఇప్పించి పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఏజీఎన్సీ ప్రాంతంలో పహణీలు ఇవ్వాలని కోరారు.ఇందులో సంఘం నాయకులు సుదర్శన్ మునేశ్వర్, గంగాధర్‌కాయపక్, సిద్ధార్థ తెలంగ్, ప్రమోద్‌కుమార్ షిండే, బండారి పోషన్న, జిల్లా యూత్ నాయకులు దూట రాజేశ్వర్, మునేశ్వర్‌స్వప్నిల్, గణపతి లాడే, జాడి కోటేశ్వర్, తదితరులున్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై, సిబ్బంది

ధన్నూర్ రోడ్డుపై వాహనాల తనిఖీ

బోథ్, మే 19: మండలంలో ధన్నూర్‌లో కుచిలాపూర్-ధనూర్ రోడ్డు పై ఆదివారం సాయంత్రం ఎస్సై బి.రాము ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న దాదాపు పదిమందిపై కేసు నమోదు చేయండం జరిగింది. అంతేగాక ద్విచక్ర వాహనాలపై ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళుతున్న వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్ఐ వివరించారు అంతేగాక డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడపరాదని తప్పని సరిగా లైసెన్స్ ఇన్సూరెన్స్ ఉండాలని ఆయన పేర్కొన్నారు. చిన్న పిల్లలకు ఇస్తే తల్లిదండ్రుల పైన కేసులు నమోదు చేయాల్సి వస్తుంది అన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

పెంబి, మే 19: చెరువులకు చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని ఇటిక్యాల్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఇటిక్యాల్ గ్రామానికి చెందిన లస్మయ్య(41) శనివారం చేపల వేటకు వెళ్లగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య నర్సవ్వ, కొడుకు శంకర్ ఉన్నారు.

మద్యం మత్తులో యువకుడిపై దాడి

పెంబి, మే 19: మద్యం మత్తులో యువకుడిపై దాడి చేసిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్నూర్ మండలం రాజంపేట్ గ్రామానికి చెందిన ఆత్రం సోనేరావు పెంబి మండలంలోని కొలంగూడలో బంధువుల పెళ్లికి వెళ్లి తిరుగు ప్రయాణంలో పెంబిలో పర్మిట్ వైన్స్ వద్ద అతనితో పాటు తన బంధువులతో పార్టీ చేసుకుంటూ ఉండగా పెంబి గ్రామానికి చెందిన సంతోష్ వెళ్లి వాళ్ల జేబులో చేయివేసి డబ్బులు తీస్తుండగా ఇద్దరి మధ్య గొడవ కావడంతో సంతోష్ అక్కడే ఉన్న బీర్ సీసాతో ఆత్రం సోనేరావును మెడపై దాడి చేశాడని, వెంటనే పెంబి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స చేసి ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు : ఎస్సై

లక్ష్మణచాంద, మే 19: ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సల్లా శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని రాచాపూర్, చామన్‌పెల్లి గ్రామాల్లో రాబోయే స్థానిక ఎన్నికల పట్ల, ఓటు హక్కు వినియోగం పట్ల ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో ఎవరైనా వ్యక్తులు ప్రజాశాంతికి భంగం కలిగేలా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కాబట్టి యువత, ప్రజలు అనవసరంగా జైలుపాలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. అదే విధంగా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రాధాన్యత గురించి కూడా చర్చించారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్సై సల్లా శ్రీకాంత్



తలమడుగు మండలంలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పాం పంట సాగు చేస్తున్న దృశ్యం

ఆయిల్‌పాం వైపు రైతుల మొగ్గు

● ఆదిలాబాద్ జిల్లాలో వెయ్యి మందికి పైగా సాగు చేస్తున్న రైతులు ● ఐదు వేల ఎకరాల్లో పంట సాగు
● తక్కువ పెట్టుబడితో.. ఎక్కువ లాభం ● ప్రభుత్వం సహకరిస్తే మరింత మంది రైతుల సంఖ్య పెరిగే అవకాశం



తలమడుగు, మే 19: ఆరుగాళం శ్రమిస్తున్న అన్నదాతలకు ప్రతియేటా సాగు కష్టాలు తప్పడం లేదు. పంట పెట్టుబడులు తడిసి మోపేడవుతున్న దిగుబడిపై నమ్మకం లేని పరిస్థితి. వాతావరణం అనుకూలించక ఒకసారి మొలకెత్తిన విత్తనాలతో మరోసారి వరుస కష్టాలను చవిచూస్తున్న రైతుల ఆలోచనలో మార్పు కనిపిస్తుంది. అధిక ఆధాయాన్నిచ్చే ప్రత్యామ్నాయ పంట సాగువైపు అడుగులు వేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా రైతుల సాగు కష్టాలను తొలగించాలని, వారికి కొంత లాభం చేకూర్చాలన్న ఉద్దేశ్యంతో పలు ప్రోత్సహకాలను కూడా అందిస్తుంది. ఇందులో భాగంగానే ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తూ రైతులకు అవగాహన కల్పించేందుకు పలు చర్యలు కూడా



తీసుకుంటుంది. తక్కువ పెట్టుబడి అవసరమవడం, లాభాదాయకం కూడా కావడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రైతులు ఆయిల్ పాం సాగు దిశగా అడుగులు వేస్తున్నారు.జిల్లాలోని నేలలు కూడా ఈఆయిల్‌ఫామ్ సాగుకు అనుకూలం కావడం వారికి మరింత కలిసి వస్తుంది. ఉమ్మడి జిల్లాలోని కొందరు రైతులు ప్రధాన పంటగా సాగు చేస్తే మరికొందరు రైతులు అంతర పంటగా సాగు చేస్తు న్నారు. జిల్లాలో రైతులు సాగుచేస్తున్న సంప్రదాయ పంటలు,పత్తి సోయాబీన్, కంది, తదితర పంటలకు అధిక వ్యయం కావడం, దిగుబడులు తగ్గడం, కూలీల కొరత వేదించడంతో జిల్లా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇదిలా ఉంటే ఆయిల్ పాం సాగుపై ప్రభుత్వం రైతులకు అవగాహణ కల్పించడమే కాకుండా పంట సాగుకు అవసరమైన డ్రిప్ ఏర్పాటు, మొక్కలకయ్యే వ్యయాన్ని ప్రభుత్వం రాయితీల రూపంలో అందిస్తుండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

● మార్చి నెల నాటి 16,890 ఎకరాలో..

ఇదిలా ఉంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వచ్చే సంవత్సరం మార్చి నెల నాటి కనీసం 16,890 ఎకరాల్లో ఈ అయిల్ పామ్ పంట సాగయ్యేలా ప్రభుత్వం జిల్లాకు లక్ష్యాన్ని కూడా నిర్దేశించింది. ఇందులో ఎక్కువ లక్ష్యం నిర్మల్ జిల్లాకు కేటాయించారు. ఆయిల్ ఫామ్ పంటను అంతర పంటగా సాగు చేయవచ్చని,ఖర్చు కూడా చాలా తక్కువగా ఉంటుందని,ఒకసారి పంటకాతకు వచ్చిందంటే రైతులకు లాభదాయకమవుతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. అటు అధిక డిమాండ్ ఉన్న ఈ పంట భవిష్యత్తులో తమకు లాభాలు తెచ్చి పెడుతుందని జిల్లా రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పది ఎకరాలలో ఆయిల్‌పాం సాగు

: రామ్‌రెడ్డి, రైతు, కజ్జర్ల గ్రామం



దశాబ్దాల నుంచి పత్తి పంట సాగు చేస్తున్నప్పటికి ప్రతి సంవత్సరం నష్టమే తప్ప ఎలాంటి లాభం లేదు.అందుకే పంటమార్పిడి పద్ధతులను అవలంభించేందుకు అధికారులు అందిస్తున్న సలహాలు, సూచన ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌ఫామ్ పంట సాగు రైతులకు ప్రోత్సాహం అందించడంతో తనకున్న 10 ఎకరాల్లో పంటను సాగు చేస్తున్నామన్నారు.

జిల్లాలో రైతులకు అవగాహన సదస్సులు

: తుమ్మల కల్యాణ్‌రెడ్డి, జిల్లా కో ఆర్డినేటర్, ఆదిలాబాద్



ఆదిలాబాద్ జిల్లాలో ఆయిల్‌పాం పంటసాగు కోసం ఆయా గ్రామాల్లోని రైతులకు పెద్దఎత్తున అవగాహన సదస్సులు కల్పిస్తున్నాం. ఆయిల్‌పాం పంటసాగు చేసే రైతులకు సబ్సిడీలు అందిస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలో వెయ్యి మంది రైతులకు గాను 5వేల ఎకరాల్లో పంట సాగుఅవుతుంది. అయిల్‌ఫామ్ పంటలో అంతర్ పంటలు వేసుకునే అవకాశం ఉందన్నారు.

ముథోల్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల..

అందని ద్రాక్షేనా?

● నిర్మల్ జిల్లాలో సౌకర్యాలు ఉన్న ఏర్పాటు చేయని వైనం ● వ్యవసాయ విద్యకు దూరమవుతున్న స్థానిక విద్యార్థులు

ముథోల్, మే 19: నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల లేకపోవడంతో అగ్రికల్చర్ విద్య విద్యార్థులకు అందని ద్రాక్షలా మారింది. ముథోల్‌లో పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదని విద్యార్థులు, విద్యావంతులు మండిపడుతున్నారు. ముథోల్ పాలిటెక్నిక్ కళాశాల లేకపోవడంతో అగ్రికల్చర్ విద్యకు విద్యార్థులు దూరమవుతున్నారు. వ్యవసాయ ఆదారిత ప్రాంతమైనప్పటికీ కళాశాల లేకపోవడం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులకు ఇంటర్‌తో సమానమైన అగ్రికల్చర్ పాలిటెక్నిక్ డిప్లొమా కళాశాల లేకపోవడంతో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. ప్రైవేట్ కళాశాలలో విద్యనభ్యసించి పేద విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మరికొంత మంది విద్యార్థులు చేసేది ఏమి లేక ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేరుతున్నారు. దీంతో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల అందుబాటులో లేకపోవడంతో ఆ విద్య అందడం లేదు.

● దూర ప్రాంతాలలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల

తెలంగాణ ప్రాంతాలల్లో జగిత్యాల, సిరిసిల్ల, రుద్రూర్, నిజామాబాద్, మహబూబ్ నగర్, జమ్మికుంట, సిద్దిపేట తదితర ప్రాంతాలలో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఉండడంతో దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాలంటే మధ్య తరగతి విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నియోజకవర్గంలో ఆయా ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాల చేయలన్న కోరిక ఉన్నప్పటికీ ఆ కళాశాల అందుబాటులో లేకపోవడంతో కొందరు


ముథోల్ వ్యవసాయ పరిశోధన కేంద్రం

చదువులు మధ్యలోనే ఆపివేయడం మరికొందరు ఇంటర్ చదవడం ఆర్థిక స్తోమత ఉన్నవారు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో వ్యవసాయ పరిశోధన స్థానం ఉంది. ఇక్కడ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయడానికి అనువైన స్థలం ఉంది. ఇక్కడి ప్రాంతంలో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసినట్లయితే నిర్మల్ జిల్లాలోని ఆయా ప్రాంతాల విద్యార్థులకు మేలు జరుగుతుందని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వమైన ముథోల్‌లో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని పలువురు విద్యార్థులు, విద్యావంతులు, పోషకులు కోరుతున్నారు.

అడెల్లి పోచమ్మ ఆలయ సమాచారం



ఆలయ పూజ సమాచారం

- ఉదయం 5 గంటలకు అభిషేకం, పట్టు వస్త్ర అలంకరణ.
- ఉదయం 8 గంటలకు నైవేద్యం సమర్పణ.
- ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఆలయం తెరచి ఉండును.
- ఈ అడెల్లి మహా పోచమ్మ ఆలయం నిర్మల్ నుండి 22 కిలో మీటర్ల ఉంటుంది.
- దేవాలయానికి నిర్మల్, భైంసా డిపోల నుండి ప్రతి ఆదివారం బస్సులు రాకపోకలు సాగుతాయి.
- రంగు రవికిషన్ గౌడ్, ఆలయ ఈవో, 9866222864
- సోనీ రికార్డ్ అసిస్టెంట్, అద్దె గదులు కిరాయికి, 9908159443
- శ్రీనివాస్ ఆలయ పూజారి, 9908215955
- ఆలయ అద్దె గదులు 29, అద్దే గదుల కిరాయి ఒక్కొక్క గదికి రూ. 1000



ఆష్ట గ్రామవాసికి ప్రత్యేక గుర్తింపు



ముథోల్, మే 19 : మండలంలోని ఆష్ట గ్రామానికి చెందిన ఏనుగు వెంకట రమణారెడ్డికి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అంతర్జాతీయ సదస్సులో ఎన్ఎల్‌సి ఇండియా కేస్ స్టడీ అంశంపై ఉత్తమ పరిశోధన అవార్డు, ప్రశంసా పత్రాన్ని యూనివర్సిటీ ప్రొఫెసర్, కో డైరెక్టర్ వెంకటయ్య, ప్రొఫెసర్, డైరెక్టర్ పల్లవి కాబ్డే చేతుల మీదుగా హైదరాబాద్‌లో ఆదివారం అందుకున్నారు. భారత దేశంలో 10 సంవత్సరాల సీఎస్ఆర్ అవలోకనం ఎన్ఎల్‌సి ఇండియా యొక్క కేస్ స్టడీ అంశం పైన అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రభుత్వ పరిపాలన విభాగంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం వెంకట రమణారెడ్డి భారత ప్రభుత్వ రంగ సంస్థ (ఎన్ఎల్‌సి) ఇండియా లిమిటెడ్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. దీంతో వెంకట రమణారెడ్డికి ఈ పురస్కారం లభించడంతో గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న వెంకటరమణారెడ్డి

నిర్మల్ ఎస్పీకి వరి ధాన్యపు కుచ్చుల అందజేత

నిర్మల్ కల్చరల్, మే 19: నిర్మల్ మండల సమాఖ్య, జిల్లా గ్రామాభివృద్ధి సంస్థ తయారు చేసిన ధాన్యంపు కుచ్చును ఆదివారం ఎస్పీ జానకి షర్మిలకు డీఆర్డీవో విజయలక్ష్మి అందజేశారు. సమీకృత వ్యవసాయ క్షేత్రంలో సాగవుతున్న వరి కంకులతో ఈ కుచ్చులను తయారు చేస్తారని సభ్యులు ఎస్పీకి వివరించారు. గృహ ప్రవేశాలకు, శుభ వేడుకలకు ఈ కుచ్చులు వాడుతారన్నారు. ఎస్పీ మాట్లాడుతూ... పక్షులకు ఆహారం ఇస్తూ ప్రకృతిని కాపాడాలని, వీటిని కొనుగోలు చేయాలని ప్రజలను కోరారు. నిర్మల్ మండల సమాఖ్యను సంప్రదించాలని సూచించారు. మహిళా సమాఖ్యను ఎస్పీ అభినందించారు.


వరి ధాన్యపు కుచ్చులను అందజేస్తున్న డీఆర్డీవో

ప్రియదర్శిని నగర్‌వాసుల సమస్యలు పరిష్కరిస్తాం : చైర్మన్

నిర్మల్ కల్చరల్, మే 19: ప్రియదర్శిని నగర్ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం కాలనీలో పర్యటించారు. త్వరలో రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలు చేపడతామన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలు ఆ ప్రాంత వాసులను అడిగి తెలుసుకున్నారు. కౌన్సిలర్లు ఎర్రవోతు నవనీత సురేందర్, ముజాహిద్ చావుస్, తదితరులు వెంట ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్ కల్చరల్, మే19: నిర్మల్ పట్టణ కేంద్రంలో సోమవారం పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏరియా హాస్పిటల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం ఉంటుంది. ఉదయం 8:30 నుంచి 11:30 వరకు బర్కత్‌పురా, ఏరియా ఆసుపత్రి, ప్రియదర్శిని నగర్, సాగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రామాలయానికి వరి ధాన్యం వితరణ

లక్ష్మణచాంద, మే19: గుర్తు తెలియని రైతుకు సంబంధించిన వరి ధాన్యాన్ని రామాలయానికి విరాళంగా అందజేసిన సంఘటన మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుడు, రైతు అయిన ఏలేటి మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తన తోట వద్ద ఎవరో రైతు రెండు ట్రిప్పుల వరి ధాన్యం ఆరబోశాడు. దాదాపు నెల రోజులు కావస్తున్నా ఆ ధాన్యం వద్దకు రాలేదు. వర్షానికి తడిసిశాయి ఎండకు ఎండాయి. ఇది గమనించి కూలీలతో నేర్పించి (ఆరబెట్టించి) వాటిని అమ్మి రామాలయానికి విరాళంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. దాదాపు 30 నుండి 40 వేలు వస్తాయని ఆ మొత్తాన్ని రామాలయ నిర్వహణ కోసం ఉపయోగిస్తామని తెలిపాడు.


● కూలీలతో ఆరబెడుతున్న గుర్తు తెలియని రైతుల వరి ధాన్యం





● లాల్‌టేకిడిలో శిథిల దశకు చేరిన డైట్ కళాశాల భవనం



● ఉట్నూర్‌లోని బీఎడ్ కళాశాల

ఆశయం ఘనం.. ఆచరణలో శూన్యం!

- గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో బీఎడ్ కళాశాల ఏర్పాటు
- 2008లో ఉట్నూర్ కేంద్రంగా కొమురంభీం ప్రాంగణంలో ప్రారంభం
- రెగ్యూలర్ ఉద్యోగుల నియామకంలో గిరిజన సంక్షేమ శాఖ విఫలం
- 2014 నుంచి కొనసాగుతున్న రెండేళ్ల పాటు ఉపాధ్యాయ శిక్షణ
- ఇప్పటి వరకు ఈ కళాశాల 500 మంది గిరిజన ఉపాధ్యాయులుగా నియామకం
- ఆశ్రమ పాఠశాలల సిబ్బందితో నెట్టుకొస్తున్న వైనం
- పని ఇక్కడ.. వేతనాలు అక్కడ
- రూ.3.50 కోట్ల వ్యయంతో భవనం నిర్మించారు.. సౌకర్యాలు మరిచారు!!
- శిథిలావస్థలో డైట్ కళాశాల భవనం

ఉట్నూర్, మే 19: రాష్ట్రంలోని గిరిజన నిరుద్యోగులకు ఉపాధ్యాయ ఉద్యోగాల కల్పించాలన్న ఉన్నత ఆశయంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉట్నూర్‌లోని కొమురంభీం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బీఎడ్ కళాశాలకు దశాబ్దాలు కావొస్తున్నా.. రెగ్యూలర్ ఉద్యోగులను నియమించడడంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు విఫలమయ్యారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజనులతో పాటు గిరిజన నిరుద్యోగులకు ఉపాధ్యాయ శిక్షణ ఇవ్వడానికి 2008లో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఉట్నూర్ కేంద్రంగా బీఎడ్ కళాశాలను ప్రారంభించారు. 2008నుంచి 2014 వరకు ఏడాది పాటు ఉన్న శిక్షణను.. ప్రభుత్వం 2014 నుంచి రెండేళ్ల పాటు కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది. 1999లో భద్రాచలంలో ఏజెన్సీ ప్రాంత గిరిజన నిరుద్యోగుల కోసం బీఎడ్ కళాశాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం 2007లో రెగ్యూలర్ పోస్టులు మంజూరు అయినప్పటికీ.. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు నియమకాలు చేపట్టలేదు. కాగా, ఉట్నూర్‌లోని బీఎడ్ కళాశాల నుంచి ఇప్పటి వరకు సుమారు 500 మంది గిరిజన ఉపాధ్యాయులుగా నియామకం కాగా మరో 300 మంది చాత్రోపాధ్యా యులు ఆయా పాఠశాలల్లో సీఆర్టీలుగా ఉద్యోగాలు నిర్వహిస్తున్నారు. గిరిజన విద్యార్థులకు చాత్రోపాధ్యాయ శిక్షణ కోసం కృషి చేస్తున్న అధికారులు రెగ్యూలర్ లెక్చరర్‌లను నియమించక పోవడంతో ఆశ్రమ పాఠశాలల సిబ్బందితో నెట్టుకొస్తున్నారు.

ఇక్కడ పని... వేతనాలు అక్కడ

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థులు మెరుగైన విద్య బోధన నిర్వహించడానికి నియామకమైన గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులను బీఎడ్ కళాశాలకు డిప్యూటేషన్‌పై పంపించడంతో బీఎడ్ కళాశాలలో పని చేస్తున్న లెక్చరర్లు ఆశ్రమ పాఠశాలలో వేతనాలు తీసుకుంటున్నారు. బీఎడ్ కళాశాలను ప్రారంభించిన గిరిజన సంక్షేమ శాఖ అధికారులు రెగ్యూలర్ లెక్చరర్‌లను నియమించడం లేదు. దశాబ్దాలు దాటిన గిరిజన సంక్షేమ శాఖ అధికారులు రెగ్యూలర్ పోస్టులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం చేయడం ఫలితంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల చదువులు అంతంత మాత్రమే అవుతున్నాయి. బీఎడ్ కళాశాలకు రెగ్యూలర్ ప్రిన్సిపాల్ లేకపోగా పీఈటీసీ ప్రిన్సిపాల్ మేస్రం మనోహార్‌గత కొన్నేళ్లుగా ఇన్‌చార్జీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అది మాదిరి, ఫిలాసఫీ, ఫిజికల్ సైన్స్, తెలుగు, సోషల్, సైకలాజీ, స్కూల్ మేనేజ్‌మెంట్, మ్యాథ్స్, ఇంగ్లీష్, విద్యా దృక్పథాలు, ఫిజికల్ డైరెక్టర్, ఫైన్ ఆర్ట్స్, పర్ఫార్మెన్స్ ఆర్ట్స్, బయోసైన్స్ లాంటివి బోధించడానికి ఆశ్రమ పాఠశాలలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లు మాణిక్‌రావు, రామరావు, రవి, రాందాస్, బానోత్ జగన్, మడావి శ్రీనివాస్, సుస్మిత, జాదవ్‌కపిల్‌కుమార్ తదితరులు డిప్యూటేషన్‌పై బీఎడ్ కళాశాలలో లెక్చరర్లుగా బాధ్యలు నిర్వహిస్తున్నారు. కాగా, వేతనాలు మాత్రం ఆశ్రమ పాఠశాలల నుంచి పొందుతున్నారు.

భవనాలు నిర్మించారు.. వసతులు మరిచారు!!

ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఎడ్ కళాశాలకు రూ.3.50 కోట్లతో భవనం నిర్మించిన అధికారులు సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. అందమైన భవనం, తరగతి గదులు, ఆహ్లాదకరమైన వాతా వరణం ఉన్నప్పటికీ రెగ్యూలర్ సిబ్బందిని నియమించక పోవడంతో చాత్రోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మహిళా చాత్రోపాధ్యాయుల కోసం బీఎడ్ కళాశాల ఆవరణలోనే కోట్లాది రూపాయలు వెచ్చించి వసతి గృహం భవనం కూడా నిర్మించారు. కేవలం చాత్రోపాధ్యా యులకు ఉండడానికి ఉపయోగపడుతున్న వసతి గృహంలో రెగ్యూలర్ వార్డెన్‌ను నియమించ లేదు. ఫలితంగా చాత్రోపాధ్యాయులే ప్రతీరోజు భవనం పరిసరాలను పరిశుభ్రం చేసుకోవడంతో పాటు వారికి కావాల్సిన ఆహారం కూడా వారే వండుకుంటున్నారు. అంతేకాకుండా వసతి గృహం నిర్మించిన అధికారులు రెగ్యూలర్ పారిశుధ్య సిబ్బందితో పాటు రెగ్యూలర్ వార్డెన్ నియమిస్తే బాగుండేదని చాత్రోపాధ్యాయులు అంటున్నారు.



● బీఎడ్ కళాశాల మహిళల వసతి గృహం

ఎన్‌సీటీఈ నిబంధనలు గాలికి..

ఎన్‌సీటీఈ (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్స్ ఎడ్యుకేషన్) నిబంధనలను అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తుంది. ఇది ఇలాగే కొనసాగితే బీఎడ్ కళాశాల మూతపడే రోజులు కూడా ఉంటాయని పరిశీలకులు అంటున్నారు. ప్రతియేటా ఉట్నూర్ బీఎడ్ కళాశాలలో డిగ్రీ చదువుకున్న గిరిజన నిరుద్యోగుల కు బీఎడ్ చదువుకునే అవకాశం ఉంది. ప్రతియేటా వంద మంది చాత్రోపాధ్యాయులకు అడ్మిషన్ లభించేఅవకాశాలు ఉన్నాయి. ఫిజికల్ సైన్స్‌లో 10, మ్యాథ్స్‌లో 25, బయోసైన్స్‌లో 20 సోషల్‌లో 35, ఇంగ్లీష్‌లో 10 మందికి అడ్మిషన్లు కల్పిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని పేద విద్యార్థులకు ఆర్థిక స్థోమ లేక పోవడం వల్ల దూర ప్రాంతాలకు వెళ్లి ఉన్నత విద్యన చదువుకోలేక పోతున్నారు. ఇప్పటికైనా క్రిస్టియన్ ఉట్నూర్ బీఎడ్ కళాశాలకు కావాల్సినన్ని రెగ్యూలర్ పోస్టులను మంజూరు చేయాలని ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులు కోరుతున్నారు.

శిథిలావస్థలో డైట్ కళాశాల భవనం

గిరిజన సమస్యలపై అధ్యయనం చేయడానికి వచ్చిన లండన్‌కు చెందిన మానవ పరిణామ శాస్త్రవేత్త ప్రొఫెసర్ క్రిస్టోఫర్ హేమన్ డార్ఫ్ జైనూర్ మండలంలోని మార్లవాయిలో 1953లో గిరిజనులకు విద్య ముఖ్యమని భావించి ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వాలు ఏర్పాటు అయ్యాక.. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు 1985లో ఉట్నూర్‌లో డైట్ కళాశాలను ఏర్పాటుచేశారు. ఐదేళ్ల తర్వాత 1990లో ఉట్నూర్ లాల్‌టేకిడిలో డైట్ కళాశాలకు నూతన భవనం నిర్మించి అప్పటి మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి శమంతకమని చేతుల మీదుగా ప్రారంభించారు. ఎంతో మంది గిరిజన నిరుద్యోగులు డైట్ కళాశాలలో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నారు. ఎంతో మంది గిరిజన నిరుద్యోగులకు ఉపాధ్యాయ శిక్షణ కల్పిస్తున్న ఈ కేంద్రాన్ని 2005లో జిల్లా అధికారులు ఎలాంటి కారణం లేకుండానే మూసివేయడంతో కోట్ల రూపాయలతో నిర్మించిన భవనం శిథిలదశకు చేరుకుంటుంది. ఇప్పటికైనా జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా ఉన్నతాధికారులు ఈ కళాశాలకు పోస్టులు మంజూరు చేయాలని, డైట్ కళాశాలను కూడా పునరుద్ధరించాలని ఉమ్మడి జిల్లావాసులు కోరుతున్నారు.

వార్డెన్‌ని నియమించాలి

: పసుల సంతోషి, చాత్రోపాధ్యాయురాలు, మంచిర్యాల



బీఎడ్ కళాశాలకు అనుబంధంగా వసతి గృహం నిర్మించినందున వార్డెన్‌ను కూడా నియమించాలి. వార్డెన్‌తో పాటువంట మనుషలను, పారిశుధ్య సిబ్బందిని నియమించినట్లయితే తాము మరింతగా కష్టపడి చదువుకునే వీలు ఉంటుంది. తామే పరిసరాలను పరిశుభ్రం చేసుకుని వంట పనులు చేసుకోవడం వల్ల చదువుకు ఇబ్బందిగా ఉంది.

డిప్యూటేషన్ ఉద్యోగులతోనే కొనసాగుతుంది

: మేస్రం మనోహార్, ప్రిన్సిపాల్, బీఎడ్ కళాశాల



2008లో ఏర్పాటు చేసిన బీఎడ్ కళాశాలకు రెగ్యూలర్ సిబ్బందిని నియమించలేదు. ప్రస్తుతం ఆశ్రమ పాఠశాలల నుంచి అనుభవమున్న పలువురు ఉపాధ్యాయులను తీసుకొని శిక్షణ తరగతులను కొనసాగించడం జరుగుతుంది. చాత్రోపాధ్యాయులకు మంచి శిక్షణతో పాటు నైపుణ్యాలు కల్పిస్తున్నాం.

'ఆంధ్రజ్యోతి' కథనంపై మంత్రి సీతక్క ఆరా

● నేడు గోళ్లగడ్ రోడ్డును పరిశీలించనున్న అధికారులు!!

భీంపూర్, మే 4: మండలంలోని బోర్లకుంట సమీపం నుంచి సరిహద్దు గ్రామం గోళ్లగడ్ వరకు నాలుగు కిలోమీటర్ల మట్టి రోడ్డు నిర్మాణం పనులు బాగా లేక స్థానికులకు కష్టాలు ఎదురు అవుతున్నాయని 'ఆంధ్రజ్యోతి' ఆదివారం అధ్వానంగా గోళ్లగడ్ రోడ్డు కథనం ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ కథనం మంత్రి సీతక్క దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. మంత్రి ఉన్నత అధికారులకు ఫోన్ చేసి గిరిజన ప్రాంత రోడ్ల నాణ్యతపై మీరు శ్రద్ధ పెట్టడం లేదా అని వాకబు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు సోమవారం గోళ్లగడ్ లింకు రోడ్డును పరిశీలించనున్నట్లు తెలుస్తుంది.


అధ్వానంగా గోళ్లగాడ్ లింక్ రోడ్డు

'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం

ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు

ఆదిలాబాద్ అర్బన్, మే 19: మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలను పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా బసవేశ్వర కమిటీ ఆధ్వర్యంలో బసవేశ్వర చౌక్ వద్ద జరిగిన ఈ వేడుకల్లో స్థానిక కౌన్సిలర్ కలాల శ్రీనివాస్ పాల్గొని బసవేశ్వర కమిటీ సభ్యులతో కలిసి ఆయన విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి జెండాను ఆవిష్కరించారు. అనంతరం బసవేశ్వర చేసిన కృషిని స్మరించుకుంటు ముందుకు సాగాలని ప్రతినభూనారు. 12వ పార్లమెంటరీ వ్యవస్థను స్థాపించిన మహనీయుడు బసవేశ్వరుడని కమిటీ సభ్యులు శివప్రసాద్ అన్నారు.ఆ సమయంలో గనగారిన వర్గాల కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరు పయనిస్తూ పేదలకు అండగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీసీసంఘం నాయకులు పార్థసారథి, ఈర్లసత్యనారాయణ, బసవేశ్వర కమిటీ సభ్యులు శివప్రసాద్, అన్నదానం జగదీశ్వర్, కేశవ్, శివలింగ్, పరమేశ్వరయ్య, శివలీలా,గణపతి, పార్వతి, రేఖ, రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

అంటరానితనాన్ని వ్యతిరేకించిన మహనీయుడు

● సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ ● జిల్లాకేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి ● నాయకులు ఘన నివాళి



ఆదిలాబాద్‌లో నివాళ్లు ర్పిస్తున్న నాయకులు



వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, మే 19: పేదలహక్కుల సాధనతో పాటు అంటరానితనానికి వ్యతిరేకంగా పుచ్చలపల్లి సుందరయ్య చిన్నతనం నుంచే ఉద్యమించారని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో సుందరయ్య 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ అంటరానితనాన్ని వ్యతిరేకించిన మహనీయుడు సుందరయ్య అని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసి హక్కులను సాధించడంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. తొలి పార్లమెంట్‌లో ప్రధానమంత్రి నెహ్రూతో కలిసి ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలకు ప్రతిపక్ష నేతగా సుందరయ్య తన సలహాలు ఇచ్చారని తెలిపారు. కార్మికవర్గ రాజ్యా సాధనకు ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఇందులో బండి దత్తాత్రి, లంక రాఘవులు, కిరణ్, ఆశన్న, సచిన్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిస్టు నాయకుడు 39వ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ టోల్‌ప్లాజా అధ్యక్షుడు నక్కలక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు, స్వాతంత్ర సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటవీరుడని, స్వాతంత్ర సమరయోధుడని, కమ్యూనిస్టు గాంధీగా పేరొందిన సుందరయ్య తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖుడని అన్నారు. ఇందులో రాజశేఖర్‌రెడ్డి, గోవన్‌సింగ్, తదితరులున్నారు.



రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



గ్రామస్థులతో కలిసి సెల్ఫీ దిగుతున్న ఎమ్మెల్యే

గ్రామాల్లో పర్యటించిన బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, మే 19: మండలంలోని ఇస్పూర్ (పెద్దగొండ్‌గూడ) గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశమై గ్రామంలో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు సమస్యలపై గ్రామస్థులతో కలిసి చర్చించారు.అప్పటికప్పుడు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వీలైనంత త్వరగా గ్రామస్థుల సమస్యలు తీర్చాలన్నారు. మార్గమధ్యలో అక్కడక్కడ గత వర్షాలకు పాడైపోయిన బ్రిడ్జిలను రహదారిని పరిశీలించి ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత బ్రిడ్జిలను మరమ్మతులు చేస్తామని అన్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌కు గ్రామస్థులు శాలువాతో సన్మానించి గ్రామానికి వచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపి సెల్ఫీ దిగారు. వీరితో పాటు ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచ్ రమేష్, గంగసింగ్, సవాయిరాం, తదితరులు ఉన్నారు.

జొన్న పంటను కొనుగోలు చేసి.. వద్దంటూ వాపస్ చేస్తున్న అధికారులు!

బోథ్, మే 19: బోథ్ మండల కేంద్రం దినేష్ అనే రైతు వద్ద మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న సహకార సంఘం అధికారులు కొనుగోలు చేసిన జొన్న పంటను పంట తడిసిందని పేర్కొంటూ తిరిగి పంపిస్తున్నట్లు రైతు దినేష్ ఆదివారం వాపోయారు. తన వద్ద ఒక 137 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేసి ఆదివారం రోజున సాయంత్రం రైతుకు ఫోన్ చేసి నీ పంట తడిసింది. వాపస్ పంపిస్తున్నాము.. ఖర్చులంతా మీరే భరించాలని అధికారులు పేర్కొనడం జరిగిందన్నారు. తడిసిన ధాన్యాన్ని కొంటామని చెప్పి తీరా తీసుకువెళ్లిన తర్వాత తిప్పి పంపడం ఎంతవరకు సమంజసం అని రైతు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. అందుకు సంబంధించిన హమాలీతో పాటు లారీ డబ్బులు సైతం తానే చెల్లించాలని అధికారులు పేర్కొనడం ఎంతవరకు సమంజసం అని రైతు అంటున్నారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడం జరిగింది అన్నారు. ఈ విషయమై అధికార, ప్రతిపక్ష నాయకులు తగిన న్యాయం చేయాలని రైతు కోరారు.

బుద్ధ జయంతి వేడుకలను జయప్రదం చేయండి : జిల్లా అధ్యక్షుడు

ఇంద్రవేల్లి, మే 19: ఈ నెల 23న జిల్లా కేంద్రంలో కైలాష్ నగర్‌లోని అశోక బుద్ధ విహార్‌లో నిర్వహించబోయే బుద్ధ జయంతి (వైశాఖ పౌర్ణమి) వేడుకలను జయప్రదం చేయాలని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు బుక్టే విఠల్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించే బౌద్ధ ధమ్మ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కావున జిల్లాలోని బౌద్ధ ఉపాసక్, ఉపాసకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోట్పోడే దయానంద్, మండల అధ్యక్షులు దుండే సంతోష్, జిల్లా నాయకులు బాలేరావ్ రాందాస్, సింధే అనిల్, కాంబే ఉత్తం, పవార్ అభీనంద్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

అసంపూర్తిగా ఆరోగ్య ఉప కేంద్రం

● ఇబ్బందులు పడుతున్న సిబ్బంది

బోథ్, మే 19: మండలంలోని పొచ్చెర గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి సరైన వసతులు లేకపోవడంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించడంతో విధులను సిబ్బంది అందులోనే నిర్వహిస్తున్నారు. అయితే బయట నుండి చూసేందుకు ఉపకేంద్రం అందంగా ఉన్న లోపల వసతులు లేవు. మంచినీటి వసతి లేకపోగా విద్యుత్ సౌకర్యం లేదు. అంతేగాక మరుగుదొడ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఫలితంగా సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. కిటికీలకు అవసరమైన తలుపులు లేకపోవడంతో అడ్డంగా గుడ్డలను కట్టడం జరిగింది. వర్షం వస్తే కిటికీల ద్వారా వర్షపు నీరు లోపలికి రావడంతో విధులు నిర్వహించేందుకు కష్టంగా మారిందని సిబ్బంది వాపోతున్నారు. 20 లక్షల రూపాయల నిధులు మంజూరు అయిన కాంట్రాక్టర్‌కు ఇప్పటి వరకు రూ.7 లక్షలు చెల్లించామని మిగతా పనిని పూర్తి చేస్తే పూర్తి స్థాయి నిధులు చెల్లించడం జరుగుతుందని సంబంధిత ఏఈ శేఖర్ తెలిపారు. అంతేకాకుండా త్వరలోనే భవనంలో అవసరమైన విద్యుత్‌తో పాటు కిటికీలు పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తామన్నారు.



పొచ్చెర గ్రామంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం



కిటికీలకు, తలుపులు లేకపోవడంతో అడ్డంగా కట్టిన గుడ్డలు